పరీక్ష రాయాలంటే పరీక్షే..!

- ఇచ్చోడలో పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రం
- సిరికొండ విద్యార్థులకు దూరభారం
- స్థానికంగా ఏర్పాటు చేయాలని వేడుకోలు


సిరికొండ జెడ్పీ పాఠశాల

సిరికొండ: విద్యార్థుల భవిష్యత్‌కు పునాది వేసేది పదో తరగతి పరీక్షలు. కానీ మండల విద్యార్థులకు మాత్రం పదో తరగతి పరీక్షలు రాయడం పరీక్షే అవుతుంది. మండల కేంద్రంలో పదో తరగతి పరీక్ష కేంద్రం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా రు. దీంతో విద్యార్థులకు దూరభారం పెరుగుతుంది.

16 కిలోమీటర్ల దూరం..

మండల కేంద్రంలోని జెడ్పీఎస్‌హెచ్, కస్తూరిబా పాఠశాల, రిమ్మ గిరిజన ఆశ్రమ పాఠశాల, రాయిగూడ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉంది కానీ, ఈ విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయాలంటే మాత్రం ఇచ్చోడ మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. దీంతో 16 కిలో మీటర్ల దూరం వెళ్లి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాస్తున్నారు.

రవాణా సౌకర్యం అంతంతే..

మండల కేంద్రలోని జెడ్పీ పాఠశాలలో 31, కేజీబీవీలో 36, రిమ్మ ఆశ్రమ పాఠశాల్లో 13, రాయిగూడ పాఠశాల్లో 25 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరందరూ పదో తరగతి పరీక్షలు రాసేందుకు రిమ్మ నుంచి సిరికొండకు, సిరికొండ నుంచి ఇచ్చోడకు 23 కిలోమీటర్లు వెళ్లి పరీక్ష రాయాలి. సిరికొండ, రాయిగూడ విద్యార్థులకు బస్సు సౌకర్యం లేదు. ప్రైవేట్ వాహనాల్లో అధిక చార్జీలు చెల్లించి ప్రయాణం చేయాల్సి ఉంటుంది. సమయభావంతో పాటు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేస్తే ఇంద్రవెల్లి మండలంలోని పిట్టబోంగారం ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు కూడా అనుకూలంగా ఉంటుంది.

పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి



పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం ఇప్పటి నుంచే ప్రిపేర్ అవుతున్నాను. కానీ పదో తరగతి పరీక్ష కంటే ఇక్కడ నుంచి ఇచ్చోడకు వెళ్లి పరీక్ష రాయడం పరీక్షగా మారింది. ఏడాది మండల కేంద్రంలో పబ్లిక్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి.

– రత్నపూరి అంకిత, పదో తరగతి, సిరికొండ

ప్రైవేట్ వాహనాలే దిక్కు



స్థానికంగా పదో తరగతి పరీక్ష కేంద్రం లేకపోవడంతో ఇచ్చోడకు వెళ్లి పరీక్ష రాయాల్సి ఉంది. అక్కడికి చేరుకోవాలంటే ప్రైవేట్ వాహనాలే దిక్కు. కొన్నిసార్లు సరైన సమయంలో వాహనాలు రావు. దీంతో సమయానికి సెంటర్‌కు చేరుకోలేని పరిస్థితి. ఇక్కడే పరీక్ష సెంటర్ ఏర్పాటు చేస్తే చదువుపై దృష్టి పెట్టవచ్చు.

– సూర్యవంశీ విద్య, పదో తరగతి, సిరికొండ

గదులు లేకపోవడంతో..



పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రం మండల కేంద్రంలో లేదు. ఇక్కడ ఏర్పాటు చేస్తే బాగుంది. పరీక్ష కేంద్రం ఏర్పాటు కోసం ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నా.. గదులు మాత్రం సరిపోవు. పరీక్ష కేంద్రం కోసం ప్రత్యేకంగా గదులు నిర్మిస్తే విద్యార్థులకు మేలు జరుగుతుంది.

– సునీల్, ఎంఈవో, సిరికొండ

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..


బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బతుకమ్మ సంబరాల్లో డీఐఈవో గణేష్‌కుమార్

ఆదిలాబాద్: జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి పలు కాలనీవాసులు బతుకమ్మ ఆడుతూ.. సందడి చేశారు. ఉదయం నుంచి తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డీజే బతుకమ్మ పాటలకు నృత్యం చేస్తూ.. ఆడిపడారు. పలు కాలనీల్లో కోలాలు, దాండియా నృత్యం ఆకట్టుకుంది. పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా అంటూ.. చెరువులు, వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

బేల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జాదవ్ గణేష్‌కుమార్ బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. విద్యార్థినులు, మహిళ అధ్యాపకులు బతుకమ్మ పాటలకు ఆడిపడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భగవాండ్లు, ఆదిలాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సర్ఫారాజ్

ఆదిలాబాద్‌రూరల్: అనారోగ్యం బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సర్ఫారాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వాన్‌వాట్ ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వంట గదిని పరిశీలించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బొమ్మెత సుభాష్, హెల్త్ అసిస్టెంట్ పవర్ ప్రేంసింగ్, హెచ్‌ఎం వెంకటేశ్వర్ రావ్, కల్యాణ్ చక్రవర్తి, వార్డెన్ ప్రతిభ పాల్గొన్నారు.

వాణిజ్య పంటలపై దృష్టి సారించాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

సాత్నాల: వాణిజ్య పంటలపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి అశ్రఫ్ అన్నారు. భోరజ్ మండలం పెండల్వాడ గ్రామంలో శుక్రవారం రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి మాట్లాడారు. హార్టికల్చర్ ఆధ్వర్యంలో 90 శాతం సబ్సిడీతో, ఆయిల్‌పాం సాగుకు చేయూత ఇవ్వడం జరుగుతుందన్నారు. సాంప్రదాయ పంటలను సాగు చేస్తూనే వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. ముంపు ప్రాంత రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో తౌసిప్, హెచ్ఈవో సతీష్, రీజనల్ మేనేజర్ రోహిత్, నవీన్, రోహిత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి


మాట్లాడుతున్న ఐటీడీఏ జీసీడీవో ఛాయాదేవి

తలమడుగు: ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఐటీడీఏ జీసీడీవో మెస్రం ఛాయాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉమ్రీ ఆశ్రమ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో సమావేశమై ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు, వంటగది శుభ్రంగా ఉంచాలని, వంట సామగ్రి, కూరగాయలు శుభ్రంగా కడిగి వంట చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు అరుణ, వార్డెన్ హిరమన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: గిరిజన సంక్షేమశాఖ ద్వారా విద్యార్థులకు అందిస్తున్న సేవలు నాణ్యమైనవిగా ఉండాలని ఏటీడీవో నిహారిక అన్నారు. శుక్రవారం మండలంలోని ఉమ్రి (బి) గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన విద్యనందించాలన్నారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాల హెచ్‌ఎం భోజన్న, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్, పీఎస్ హెచ్‌ఎం ఆడే రాజేశ్వర్, సిబ్బంది మోహన్, వసంత్‌రావ్, రాంచంద్రన్ పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం'


పార్టీలో చేరిన నాయకులతో జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్, బీజేపీలు రెండు ప్రజలను మోసం చేసి గద్దెనెక్కాయని మండిపడ్డారు. అధికారం వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే పాయల్ శంకర్ చంద్ర పూర్ నుంచి భోరజ్ వరకూ అంతర్రాష్ట్ర రోడ్డు పనులు ఎందుకు పూర్తి చేయించలేకపోతున్నారని ప్రశ్నించారు. తర్నం బ్రిడ్జి ఎందుకు పనులు చేయించడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రహ్లాద్, రాజన్న, దమ్మపాల్, రఫీక్, సుదీర్, దయాకర్ పాల్గొన్నారు.

బీసీలకు న్యాయం చేయాలి


ఇచ్చోడ: ఆందోళన చేస్తున్న బీసీ నాయకులు


తలమడుగు: రాస్తారోకో చేస్తున్న నాయకులు

ఇచ్చోడ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ.. న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. మండలంలోని ముఖరా(బి) గ్రామంలో శుక్రవారం బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాటకు కట్టుబడి ఉండాలన్నారు. బీసీ రిజర్వేషన్లను రద్దు చేయడంలో హైకోర్టు స్టే ఇవ్వడంపై అగ్రవర్ణాల కుట్ర దాగి ఉందన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో స్థానిక సంస్థల ఎన్నికలు త్వరగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడవ్ మారుతి, నాయకులు పాల్గొన్నారు.

తలమడుగు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు అయ్యాకే ఎన్నికలు నిర్వహించాలని మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవికాంత్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని సుంకిడి అంతరాష్ట్ర రహదారిపై రాస్తారోకో చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని కట్టుబడి ఉండి 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా ఇచ్చిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ప్రక్రియ చేపట్టాలన్నారు, నాయకులు వెంకన్న, మడూరి రమాకాంత్, తోట వెంకటేశ్, ఆశన్న యాదవ్, అసం రవి, మహేందర్ యాదవ్, శశికాంత్ యాదవ్, శ్రీనివాస్, వామన్, అజయ్, ప్రమోద్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని ఐబీ చౌరస్తాలో వివిద బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. బీసీ నాయకులు మాట్లాడుతూ.. రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం, కాంగ్రెస్ బీసీలను అడ్డుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తానన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు బింగి వెంకటేశ్, కొండే రమేశ్, సిపతి లింగాగౌడ్, సాడిగే రాజేశ్వర్, కందుకూరి రమేశ్, వేద ప్రకాష్, బొడ్డు కిరణ్, మరికంటి నారాయణ, సాల్గర్ రవీందర్, శ్రీకాంత్, పొన్నం జగన్, చింతల రమణ, రవి పాల్గొన్నారు.

అర్హత లేని టీచర్లతో విద్యాబోధన


వినతిపత్రం అందిస్తున్న తల్లిదండ్రులు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లోని సెయింట్ పాల్స్ పాఠశాలలో అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం పాఠశాల యజమాన్యానికి వినతిపత్రం అందించారు. అధ్యాపకులకే అర్హత లేకపోతే విద్యా ప్రమాణాలు దెబ్బతింటాయన్నారు. పాఠశాలలో పని చేస్తున్న ప్రతీ టీచర్ అర్హతలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. అర్హతలు లేని ఉపాధ్యాయులు ఉంటే, వారిని వెంటనే తొలగించి, అర్హత కలిగిన టీచర్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ధరణి రాజేశ్, దూట మహేందర్, గవస్కర్ లక్ష్మి, మాన్ సార్ పాల్గొన్నారు.

ఐటీఐలో వాక్ఇన్ అడ్మిషన్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 5వ విడత వాక్ఇన్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 13 నుంచి 17 వరకు కళాశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అడ్మిషన్ పొందవచ్చన్నారు. అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలు, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న సీట్ల కేటాయింపు పత్రాలతో హాజరు కావాలని కోరారు.

విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడొద్దు


మాట్లాడుతున్న నాయకులు

నార్నూర్: విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడొద్దని, బెస్ట్ అవైలబుల్ స్కీం స్కాలర్‌షిప్ పెండింగ్ నిధులు విడుదల చేయాలని రాజ్‌గోండ్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు కుంర చతుర్‌షావ్, జైభారత్ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దీపక్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుమురంభీం చౌక్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు ఎంపికయ్యారని, ప్రభుత్వం పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేసి వారి భవిష్యత్‌ను కాపాడాలన్నారు. దసరా సెలవు తర్వాత వారు ఇంటి వద్దే ఉన్నారని ఇప్పటికైనా ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా స్పందించి పిల్లలకు న్యాయం చేయాలని డి మాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ప్రధాన కార్యదర్శి ఆర్కా గోవింద్, ఆత్రం జాలిమ్ షావ్, రిషికుమార్, తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న మెస్రం రూప్‌దేవ్

నార్నూర్: మండల కేంద్రంలోని కుమురం భీం భవన్ వద్ద ఈనెల 12న ఆదివారం దసరా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆదివాసీ జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుమురం భీం భవన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీ గిరిజన సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం 12న ఉదయం 9:30 గంటలకు దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్రామపటేళ్లు, కటోడాలు, దేవారిలు, గిరిజనులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు, ఐటీడీఏ పాలక మండలి మాజీ డైరెక్టర్ మాడవి మాన్కు, ఉర్వేత రూప్‌దేవ్ పాల్గొన్నారు.

సీతాఫలాలకు గిరాకీ



ఎన్నో ఔషధ గుణాలు కలిగిన ఫలం సీతాఫలం. ఈ సీజన్‌లో ఈ ఫలాలకు గిరాకీ అధికంగా ఉంది. ఆయా గ్రామస్తులు మండలంలోని జాతీయ రహదారి పక్కన చింతగూడ రోడ్డుపై బుట్టల్లో సీతాఫలాలు విక్రయిస్తూ.. ఉపాధి పొందుతున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండడంతో అధికంగా కొనుగోలు చేస్తున్నారు.

– గుడిహత్నూర్

ఓటు చోరీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

కైలాస్‌నగర్: దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఓట్ చోరీ అంశాన్ని పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదిలాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయం నుంచి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఓట్ల చోరీ బీహార్‌లో మాత్రమే కాకుండా ఉత్తర ప్రదేశ్, హర్యానా, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలలో కూడా జరిగిందన్నారు. బీ జేపీ విధానాలను ఎండ గట్టా లని సూచించారు. సంతకాలు పూర్తి చేసి రేపటిలోగా క్యాంప్ కార్యాలయంలో అందించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బేల: మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో పని చేసేందుకు ఖాళీగా ఉన్న ఆయా పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి కదం మహాలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు పదో తరగతి పాసై ఉన్న మహిళ అభ్యర్థులు మాత్రమే అర్హులని, ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అధార్‌కార్డు, నివాసం, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు రెండు పాస్ ఫొటోలతో ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నేరడిగొండ: తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం రెండో రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను శుక్రవారం మండల కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు చాట్ల పోసవ్వ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శని, ఆదివారాల్లో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే భారీ ర్యాలీ, బహిరంగ సభకు వేలాది మంది బీడీ కార్మికులు, ప్యాకర్లు, బట్టి, చటన్, టేకేదారులు తరలిరావాలని కోరారు. బీడీ పరిశ్రమపై సుమారు 8 లక్షల మంది కార్మికులు పనిచేస్తూ జీవనం గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రూ. 4016 జీవన భృతి ఇచ్చేవరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో జాదవ్ శాంతి, లంగోరి లక్ష్మి, ఎంపులూరి శ్రీలత, కొక్కులవార్ భూపతి, బాణావత్ వసంతరావు, జాదవ్ కపిల్‌దేవ్, రాథోడ్ వసంత్‌రావ్, ఉపేందర్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి


నల్లాలను పరిశీలిస్తున్న ఎంఈవో అనిత

నార్నూర్: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంఈవో పవార్ అనిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి నల్లాలను పరిశీలించి పని చేసేలా చూడాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యాబోధనలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు నర్సాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఇచ్చోడ ఏఈ రాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారుల సహకరించాలని కోరారు.

తాంసి: మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ మనోజ్ కుమార్ అన్నారు. 33 కేవీ అర్లి(టి) ఫీడర్‌లో మరమ్మతులతో పాటు చెట్లకొమ్మల తొలగింపు పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

భీంపూర్: వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని జల్‌కోరిలో వైద్యశిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్య విస్తరణాధికారి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు రోహిదాస్, సిబ్బంది సుమతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ బీఈడీ కళాశాల నూతన ప్రిన్సిపాల్ నియమితులైన రాథోడ్ మాణిక్‌రావ్‌ను ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.. నాయకులు జాదవ్ రవికుమార్, అశోక్ కుమార్, దిలేష్ చౌహన్, శీతల్ చౌహన్, బానోత్ ఆత్మరాం, దినేష్ కుమార్, ప్రేమ్‌సింగ్, ప్రకాష్ పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం అండర్- 14, 17 బాలురలకు జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రామేశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, బోనఫైడ్, పుట్టిన తేదీ సర్టిఫికెట్, పోయిన సంవత్సరం చదివిన తరగతి మార్కులిస్టు తీసుకొని ఉదయం 9.30 గంటలకు ఇచ్చోడ జిల్లా పరిషత్ పాఠశాల గ్రౌండ్‌లో హాజరు కావాలని కోరారు.

బాధిత రైతులకు పరిహారం అందజేత

సిరికొండ: మండలంలోని రిమ్మ గ్రామానికి చెందిన మడావి సీతారాం, పెందూర్ జంగు, పెందూర్ శంభు రైతుల ఎద్దులు గత ఏడాది క్రితం విద్యుత్ షాక్‌తో మృత్యువాత పడ్డాయి. దీంతో సదరు రైతులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఒక్కొక్క రైతుకు శుక్రవారం రూ. 40 వేల చొప్పున పరిహారాన్ని ఆదిలాబాద్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో అందుకున్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు, రిమ్మ మాజీ సర్పంచ్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

బేల: ఉచిత ఫిజియోథెరపీ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి కదం మహాలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో ఫిజియోథెరపీ వైద్యురాలు అసు మమత నూతనంగా నియామకమై విధుల్లో చేరారు. 18 సంవత్సరాల లోపు నరాలు, కండరాల బలహీనత ఉన్న పిల్లలకు ప్రతీ బుధ, శుక్రవారంలో నిర్వహించే శిబిరాల్లో చికిత్సలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ సంతోష్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

నేరడిగొండ: ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సద్దాం అన్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో ఎన్‌సీడీ, బాలల టీకాకరణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ఆశ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు, సాధించిన విజయాలు, అమలు చేయాల్సిన అంశాలపై చర్చించారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఏఎన్‌ఎం జ్యోతి, ఆశ కార్యకర్త రమాదేవి పాల్గొన్నారు.

108లో ప్రసవం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన ముక్తబాయికి శుక్రవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో 108లో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో కుమ్మరితండా వద్ద ప్రసవించింది. 108 సిబ్బంది జన్మించిన మగ శిశువు, తల్లిని ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ ప్రవీణ్, పైలెట్ రాజేందర్‌లు తెలిపారు.